నమస్తే తెలంగాణ
నిజామాబాద్, గురువారం 17 అక్టోబర్ 2024
THURSDAY, OCTOBER 17, 2024

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 16 : డీఎస్సీ 2024 ఉపాధ్యాయ నియామకం ద్వారా బాన్సువాడ మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో నాగేశ్వర్‌రావు జాయినింగ్ ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ ద్వారా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీరిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమయ పాలన తప్పకుండా పాటించాలన్నారు. ఉపాధ్యాయులు మంద ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

భిక్కనూరు, అక్టోబర్ 16 : మండలంలోని బస్వాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలకు ఏమైనా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

బీడీ కార్మికుల ధర్నా

బీడీ కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

కామారెడ్డి, అక్టోబర్ 16 : దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికుల నుంచి ఏడాదికి రూ.20 కోట్లు వసూలు చేస్తున్నందుకు నిరసనగా దేశాయ్ బీడీ కంపెనీ ఎదుట బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంపెనీ యాజమాన్యం కార్మికుల నుంచి ప్రతి వెయ్యి రూపాయలకు పది రూపాయల చొప్పున వసూలు చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి విచారణ చేపట్టి కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, బాలమణి, వెంకట్‌గౌడ్, నరసింహులు, అరుణ్, శ్రీహరి పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన అధికారి మృతి

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 16 : బాన్సువాడ రేంజ్ పరిధిలోని నిజాంసాగర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అధికారి స్వల్ప అస్వస్థతకు గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గులాం దస్తగిరి అస్వస్థతకు గురికాగా బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెండేండ్లుగా బాన్సువాడ రేంజ్‌లో ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు అధికారులు, ప్రజా ప్రతినిధుల సూచన
- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లింగంపేట/గాంధారి/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/ నిజాంసాగర్/నస్రుల్లాబాద్/భిక్కనూరు/రాజంపేట్, అక్టోబర్ 16: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని పలువురు అధికారులు, విండో, సొసైటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు రైతులకు సూచించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. (ఏ) గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,320, (బీ) గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,300 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు విక్రయించిన ధాన్యం డబ్బులు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా తూకం వేస్తారని చెప్పారు.

లింగంపేట మండలంలోని పర్మళ్ల, లింగంపేట, బోనాల్, భవానీపేట, ముంబాజీపేట, కంచుమహల్ తదితర గ్రామాల్లో సహకార సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. సజ్జన్‌పల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని రైతులు ప్రారంభించారు. లింగంపేట ఏవో అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండలం గండివేట్‌లో ముదెల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ సజ్జనపల్లి సాయిరాం ఏఎంసీ చైర్మన్ పరమేశ్‌తో కలిసి ప్రారంభించారు. విండో వైస్ చైర్మన్ బన్సీ, కార్యదర్శి కృష్ణారెడ్డి, గండివేట్ మాజీ సర్పంచ్ అబ్దుల్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు. గాంధారి, గుర్జాల్, మాతుసంగెం, పేట్‌సంగెం, బ్రాహ్మణ్‌పల్లి, చద్మల్, పొతంగల్ కుర్ధు గ్రామాల్లో గాంధారి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను విండో చైర్మన్ సాయికుమార్ ప్రారంభించారు. తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ రవి, గాంధారి మాజీ సర్పంచ్ సంజీవ్, విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామంలో సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఏగుల నర్సింహులు, మత్తమాల ప్రశాంత్‌గౌడ్ ప్రారంభించగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ సురేశ్, ఏఈవో సతీశ్, సిబ్బంది మల్లేశ్, సత్యం, ప్రభుదాస్, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, కిచ్చన్నపేట సొసైటీల పరిధిలో 16 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధ్యక్షులు దుందిగల్ల నర్సింహులు, ఆకిడి గంగారెడ్డి తెలిపారు. మాల్తుమ్మెద విండో పరిధిలో పోచారం, వదలపర్తి, గోలిలింగాల, చీనూర్, మేజర్‌వాడీ, కిచ్చన్నపేట సొసైటీ ఆధ్వర్యంలో తాండూర్, మాటూర్, మాసన్‌పల్లి, ఆత్మకూర్‌లో రెండు కేంద్రాలు, జలాల్‌పూర్, జప్తిజాన్కంపల్లి, మేలకుంటతండా బొల్లారం, రాఘవపల్లి, అచ్చయపల్లి గ్రామాల్లో ఒక్కో కేంద్రం చొప్పున ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యం, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధయ్య, రాజిరెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట సొసైటీ పరిధిలో ఉన్న గోర్గల్ గ్రామంలో మండల వ్యవసాయాధికారి అమర్‌ప్రసాద్, మహ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో తహసీల్దార్ సవాయిసింగ్, సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, చించొల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో డీసీవో రామ్మోహన్ రావు, నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో చైర్మన్ హన్మంత్ రావు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మైలారం గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని డీసీవో రామ్మోహన్ రావు పరిశీలించారు. కార్యక్రమంలో బీర్కూర్ విండో చైర్మన్ గాంధీ, క్లస్టర్ అధికారిణి కవిత, డైరెక్టర్లు బాశు, ధర్మయ్య, మహేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి, అంతంపల్లి, బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయాధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల విండో చైర్మన్లు రాజాగౌడ్, వెంకట్‌రెడ్డి, విండోపర్సన్ ఇన్‌చార్జిలు కిష్టాగౌడ్, మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, ఏవో రాధారెడ్డి, ఏఈవో లత, సీఈవోలు మోహన్‌గౌడ్, శ్రీనివాస్, విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రాజంపేట మండలం ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ శివరాములు ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి మసిమొద్దీన్, డైరెక్టర్లు మధుకర్, మల్లా రెడ్డి, సాయిలు, ఏఎంసీ డైరెక్టర్లు సాయాగౌడ్, బాల్‌రాజు, ఏఈవో రజిత, సీఈవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

లింగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి.

గండిమాసానిపేట్ సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు..

పెద్దమల్లారెడ్డిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారులు

వదలపర్తిలో విండో అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

మాచారెడ్డి, అక్టోబర్ 16 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఎడపల్లి శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుధవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, రాజాగౌడ్, హంజీ నాయక్, శ్రీనివాస్, రమేశ్, మల్లేశ్‌యాదవ్, అబ్దుల్‌ఖాన్, కిషన్, అజీజ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 16 : లయన్స్ క్లబ్ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరం కొనసాగుతున్నది. అనేక వ్యాధులకు ఈ ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ ద్వారా నయం చేయవచ్చని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, అక్టోబర్ 16 : నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షలు సంబంధించిన ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కేజీబీవీలో అకౌంటెంట్ పోస్టులకు..

కామారెడ్డి, అక్టోబర్ 16 : జిల్లాలోని బీబీపేట్, లింగంపేట్, మద్నూర్, నాగిరెడ్డిపేట్‌లోని కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అకౌంటెంట్స్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేషన్, బేసిక్ కంప్యూటర్ స్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సు కలిగి ఉండాలని లేదా బీకాం కంప్యూటర్ చేసినవారు అర్హులని తెలిపారు. https://deokamareddy.in వెబ్ సైట్‌లో ఈ నెల 21 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

భిక్కనూరు, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. భిక్కనూరులోని మహ్మద్ ఖదీర్‌కు చెందిన గేదె వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ వైర్‌కు తాకడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల పశు వైద్యాధికారి దేవేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

19న సీపీఎం జిల్లా మహాసభలు

బిచ్కుంద, అక్టోబర్ 16: సీపీఎం జిల్లా మహాసభలను ఈనెల 19వ తేదీన కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్‌గొండ తెలిపారు. బుధవారం ఆయన బిచ్కుందలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సభల్లో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.అజయ్, గోవింద్, జైవీరయ్య, విఠల్, మోతీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ఆల్ప్రాజోలం పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డీఎస్పీ

వివరాలను వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

లింగంపేట, అక్టోబర్16: మండలంలోని సురాయిపల్లి గ్రామంలో నిషేధిత ఆల్ప్రాజోలం పట్టుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. లింగంపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని సురాయిపల్లి గ్రామానికి చెందిన రమేశ్ గౌడ్ నిషేధిత రసాయనాలు, ఆల్ప్రాజోలం కలిపి కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కల్లు దుకాణంపై దాడి చేశారు. అక్కడ 30 గ్రాముల ఆల్ప్రాజోలం ప్యాకెట్లు, రెండు కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

దీంతో రమేశ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నాగిరెడ్డిపేట మండలంలోని రామక్కపల్లి గ్రామానికి చెందిన తన బంధువు సత్యనారాయణ గౌడ్ నుంచి ఆల్ప్రాజోలం తీసుకువచ్చి రెండేండ్లుగా కల్లు వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించినట్లు తెలిపారు. దీంతో రామక్కపల్లిలోని సత్యనారాయణ గౌడ్ ఇంటిపై దాడి చేయగా.. అక్కడ 20 గ్రాముల ఆల్ప్రాజోలం లభ్యమైందన్నారు. ఇద్దరు నిందితుల నుంచి 50 గ్రాముల ఆల్ప్రాజోలం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు పట్టుకున్న ఎస్సైతోపాటు పోలీసు సిబ్బందిని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. విలేకరుల సమావేశంలో ఎస్సై అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్లు భైరవప్రసాద్, రమేశ్, రామస్వామి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

లింగంపేట, అక్టోబర్16: మండలంలోని అయ్యపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. పర్మళ్ల తండాకు చెందిన జీరి – గణేశ్ దంపతులు ద్విచక్ర వాహనంపై లింగంపేటకు వస్తున్నారు. వాహనం అదుపు తప్పి వడ్లకుప్ప పైకి వెళ్లింది. దీంతో ప్రమాదం సంభవించి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లింగంపేటలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తండావాసులు తెలిపారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

లింగంపేట, అక్టోబర్ 16: లింగంపేట రామాలయ ధర్మకర్త గుండ విజయ్‌కుమార్ గుప్తా పలువురు పేద మహిళలకు బుధవారం ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా రెండు వందల మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'రజకులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తాం..'

ఎల్లారెడ్డి, అక్టోబర్ 16: ఎల్లారెడ్డిలో రజకుల కోసం కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని బల్దియా చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బల్దియా చైర్మన్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఏడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు బల్దియా చైర్మన్‌ను బదిలీపై ఎల్లారెడ్డికి వచ్చిన ట్రాన్స్‌కో ఉద్యోగులు కలిసి సన్మానించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్, లైన్‌మన్ శశికాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ట్రాన్స్‌కో ఏడీఈ

లింగంపేట, అక్టోబర్ 16: లింగంపేట సబ్ డివిజన్ ఏడీఈ మల్లేశం బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఏడీఈగా విధులు నిర్వహించిన తిరుపతిరెడ్డి బదిలీపై మాచారెడ్డికి వెళ్లగా ఆయన స్థానంలో కామారెడ్డి సర్కిల్ కార్యాలయంలో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న మల్లేశం లింగంపేటకు వచ్చారు. విధుల్లో చేరిన ఆయనకు లింగంపేట, శెట్పల్లిసంగారెడ్డి ఏఈలు సాయినాథ్, హరీశ్‌రావు స్వాగతం పలికారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

లింగంపేట, అక్టోబర్16: లింగంపేటలో హైకోర్టు న్యాయవాది మొయిన్ అహ్మద్ ఖాద్రీ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన ఖవ్వాలి ఆకట్టుకున్నది. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన

పోచారం ప్రాజెక్టు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 16: పోచారం ప్రాజెక్టు వద్ద టూరిజం గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం ఆర్డీవో మన్నె ప్రభాకర్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద ఉన్న స్థలాల వివరాలను గిర్దావర్ మహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకంపల్లి బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు పోచారం ప్రాజెక్టుతోపాటు వెంకంపల్లి బ్రిడ్జిని సందర్శించినట్లు చెప్పారు. నివేదికను ఎమ్మెల్యేకు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యం, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితా వెంకట్రామ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గంగారెడ్డి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, నాయకుడు సంజీవులు తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్ మండలంలో పర్యటించిన సబ్ కలెక్టర్

ఆదర్శ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్, అక్టోబర్ 16: నిజాంసాగర్ మండలంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం విస్తృతంగా పర్యటించారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అచ్చంపేట దళితులతో దళితబంధు గురించి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల కోసం తయారుచేసిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో గోల్‌బంగ్లా వద్ద టూరిజం కోసం రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టును తిలకించారు. ఆమెవెంట తహసీల్దార్ భిక్షపతి, సర్వేయర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

డెస్కుల వితరణ

డెస్కులను అందజేస్తున్న పైడి ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 16: మండలంలోని బంజార తండా డీఎన్‌టీ పాఠశాల విద్యార్థులకు శాస్త్రవేత్త, బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి బుధవారం డెస్క్ బెంచీలను వితరణ చేశారు. రూ.35వేల విలువైన బెంచీలను అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మాండ్లు, దేవీసింగ్, కిషన్, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, వెంకట్‌గౌడ్, సదానంద్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIEDS క్లాసిఫైడ్స్

SITE FOR SALE
★EAST ఫేసింగ్ 40ft Road గా గల 158 చదరపు గజముల స్థలం అమ్మకమునకు కలదు. హౌసింగ్‌బోర్డ్ బృందావన్ కాలనీ, కామారెడ్డి సెల్: 9618126122, 7981741155
NTZ-334409

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

లింగంపేట, అక్టోబర్16: లింగంపేట మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నట్లు మండల పంచాయతీ అధికారి మల్హరీ తెలిపారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంలో గృహ యజమానులు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ప్లాట్ల వద్దకు వెళ్లి స్థితిగతులను పరిశీలిస్తున్నామన్నారు. లింగంపేటలో 1216 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 350 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో లేని కారణంగా విచారణలో జాప్యం జరుగుతున్నదని వెల్లడించారు. ఎంపీవో వెంట నీటి పారుదల శాఖ ఏఈ నవీన్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు వైద్య పరీక్షలు

రామారెడ్డి, అక్టోబర్ 16: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో చిన్నారులను పరీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద ఎంపీవోపై విచారణ

విచారణ చేపడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

బిచ్కుంద, అక్టోబర్ 16: మండల పంచాయతీ అధికారి తమను వేధిస్తున్నాడని మండలంలోని 27 గ్రామ పంచాయతీల కార్యదర్శులు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు ఈనెల ఒకటో తేదీన ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ డీఎల్పీవో నాగరాజుతో కలిసి బుధవారం విచారణ చేపట్టారు. బిచ్కుంద ఎంపీడీవో కార్యాలయంలో వివరాలను సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో డీపీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 16: ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. కొత్తగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన 29మందిని ఉద్దేశించి ఆయన లింగంపేట విద్యా వనరుల కేంద్రంలో మాట్లాడారు. ఉపాధ్యాయ వృతి పవిత్రమైనదని, సంఘంలో గొప్ప గుర్తింపు ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే దక్కుతుందన్నారు. వారికి పలు సూచనలు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం..

కొత్తగా నియామక పత్రాలను అందుకున్న ఉపాధ్యాయులను పీఆర్టీయూ(టీఎస్) లింగంపేట మండల అధ్యక్షుడు రాము, ఎంఈవో ప్రభాకర్ బుధవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ బోధన అందించి గుర్తింపును పొందాలని సూచించారు. పీఆర్టీయూ(టీఎస్) మండల ప్రధాన కార్యదర్శి సబాత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 2,800క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, అక్టోబర్ 16: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం 2,800 క్యూసెక్కుల వరద వస్తున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు ఒక వరద గేటును ఎత్తి 2,500క్యూసెక్కులను, ప్రధాన కాలువ ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1405.00 అడుగుల (17.802టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1404.98 అడుగుల (17.773 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని వివరించారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, అక్టోబర్ 16: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు ఫామ్‌నంబర్ 18, ఉపాధ్యాయులు ఫామ్ నంబర్ 19 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ ఆరో తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నదని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

కామారెడ్డి, అక్టోబర్ 16 : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కామారెడ్డి సర్కిల్, దేవునిపల్లి, మాచారెడ్డి, రామారెడ్డి పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. రూరల్ సీఐ రామన్, ఎస్సై రాజు పాల్గొన్నారు.